ఒకే చోట గృహాలంకరణకు లభించే షోరూం ఏర్పాటు విశేషం

విశాలాంధ్ర -భీమవరం టౌన్ : గృహాలంకరణకు కావలసిన అన్ని రకాల ఐటమ్స్ ఒకే చోట లభించే విధంగా నూతన షోరూం ప్రారంభించడం అభినందనీయమని ఆంధ్రప్రదేశ్ శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్,ఉండి ఎమ్మెల్యే మంతెన రామరాజు అన్నారు. బుధవారం భీమవరం గోవర్ధన్ థియేటర్ రోడ్డులో నిర్మల ఎంటర్ ప్రైజెస్, నిర్మల హెూమ్ మార్ట్ వారి సోమాని టైల్స్ స్టూడియో, కర్టెన్స్ స్టూడియో, స్లీక్ మాడ్యులర్ కిచెన్ నూతన షోరూంను ప్రారంభించి మాట్లాడారు.భీమవరంలో గత 24 సంవత్సరాలుగా నిర్మల ఎంటర్ ప్రైజెస్ ఇంటీరియర్ మెటీరియల్స్ అన్ని సప్లయి చేయడం గొప్ప విశేషమని అన్నారు.నిర్మల షోరూమ్స్ మేనేజింగ్ పార్టనర్స్ పాలివెల సురేంద్ర, ఉద్దగిరి శివ, పలివేల శ్రీకాంత్ మాట్లాడుతూ ఒక్క సిమెంట్, ఐరెన్ తప్ప .. మీ ఇంటికి కావలసిన ప్రతి ఒక్క వస్తువు ఒకే చోట లభిస్తుందని, 15 ఏళ్ల అనుభవం కలిగిన వ్యక్తులతో గృహపలంకరణకు కావాల్సిన ఐటమ్స్ పై అవగాహనా కల్పిస్తామని అన్నారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నర్సాపురం పార్లమెంట్ వైఎస్సార్ సిపి ఇన్ ఛార్జ్ గూడూరి ఉమాబాల, ఎఎంసి చైర్మన్ కోటిపల్లి బాబు, జడ్పీటిసి కంద్రేగుల నరసింహారావు, ఎంపిపి పేరిచర్ల విజయ నరసింహరాజు, తోట బోగయ్య తదితరులు పాల్గొన్నారు.

నమస్తేలో నమోదుకండి

విశాలాంధ్ర -భీమవరం: మురుగు, సెప్టిక్ ట్యాంక్ కార్మికుల జీవన భద్రత, మెరుగైన ఉపాధి కల్పనే ధ్యేయంగా భారత ప్రభుత్వం చేపట్టిన నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైజ్డ్ శానిటేషన్ ఎకోసిస్టమ్ పథకం(నమస్తే)లో సంబంధిత కార్మికులు నమోదు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేసి మాట్లాడుతూ కేంద్ర సామాజిక న్యాయం సాధికారత మంత్రిత్వశాఖ, పట్టణ గృహ వ్యవహారాల మంత్రిత్వ శాఖ సంయుక్తంగా నిర్వహిస్తున్న పైలట్ ప్రాజెక్ట్ అమలుకు స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని పురపాలక సంఘాల పరిధిలో ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నట్లు తెలిపారు.ఇందులో భాగంగా స్వచ్ఛంధ్రా కార్పొరేషన్ అధికారులు, భీమవరం పురపాలక సంఘ అధికారుల ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీ శుక్రవారం ఉదయం 10 గంటల నుండి 5 గంటల వరకు భీమవరం పురపాలక సంఘ కార్యాలయంలో భీమవరం పట్టణ పరిధిలో మల మురుగు, సెప్టిక్ టాంక్ శుభ్రపరిచే కార్మికుల గుర్తింపు నమోదు కార్యక్రమం చేపట్టామన్నారు.

మహిళా సాధికారతకు ముఖ్యమంత్రి జగన్ కృషి

విశాలాంధ్ర- కొయ్యలగూడెం : ముఖ్యమంత్రి జగన్ మహిళా సాధికారతకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ వారి అభివృద్ధికి తోడ్పడుతున్నారని రాజవరం గ్రామపంచాయతీ సర్పంచ్ ఏలేటి చిన్న తుక్కయ్య పేర్కొన్నారు. రాజవరం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం గ్రామంలో ఉన్న మహిళలకు వైయస్సార్ చేయూత పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సర్పంచ్ తుక్కయ్య మాట్లాడుతూ 45 సంవత్సరాల నుండి 60 సంవత్సరాల లోపు మహిళల అభివృద్ధికి రూ. 18,500లను ప్రతి ఏటా వారి ఖాతాలలో జమ చేసి చిరు వ్యాపారాలు నిర్వహించుకుని అభివృద్ధి చెందాలని ధృఢమైన సంకల్పంతో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని తుక్కయ్య పేర్కొన్నారు. అనంతరం ముఖ్యమంత్రి జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో వెలుగు సిసి వి. శ్రీనివాస్, డ్వాక్రా సంఘాల సిఐలు, పంచాయతీ కార్యాలయ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, గ్రామ మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి

విశాలాంధ్ర- కొయ్యలగూడెం : ఆరోగ్య విషయంలో ప్రజలంతా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని బయ్యనగూడెం ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి వి. సత్యనారాయణ తెలిపారు. మండలంలో రామనుజపురం గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి గ్రామంలోని ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి గ్రామ ప్రజలతో మాట్లాడుతూ బీపీ,షుగర్ ఉన్నవారు తమ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని ఆరోగ్య విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని పలు సూచనలను ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి ఎల్ సుబ్రహ్మణ్యం, షేక్.షాన్ బాషా, బి. రవితేజ, బి. సోమలమ్మ, కె.సంపత్, కె. సుజాత, ఎం. విజయలక్ష్మి, పి. సునీత, ఎస్.కె. షబ్బీర్, షేక్. మహబూబ్ తదితరులు పాల్గొన్నారు.

మొగల్తూరు డిప్యూటీ తహశీల్దార్‌గా సూర్యనారాయణరాజు

విశాలాంధ్ర-మొగల్తూరు: మొగల్తూరు మండల డిప్యూటీ తహశీల్దార్‌గా సూర్యనారాయణరాజు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. మొగల్తూరులో పని చేస్తున్న డీటీ జి. సరేష్ కుమార్ పాలకోడేరు మండలం డిప్యుటేషన్ పై వెళ్ళారు. ఈ సందర్భంగా బాధ్యతలు స్వీకరించిన సూర్యనారాయణ రాజుకు మొగల్తూరు మండల తహశీల్దార్ బి. ఎస్.ఆర్ భాస్కర్,మండలంలోని వి.ఆర్. ఓ,వి.ఆర్. ఏ లు కార్యాలయ సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.

బొలిశెట్టి క్రికెట్ లీగ్ టెన్నిస్ బాల్ మెగా క్రికెట్ టోర్నమెంట్

విశాలాంధ్ర - పెంటపాడు: జనసేన పార్టీ యువ నాయకులు బొలిశెట్టి రాజేష్ ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెం నియోజకవర్గ పరిధిలో టెన్నీస్ బాల్ మెగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తుమరాడ చిన్న,షేక్ సలీం,షేక్ ఖరీం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.టోర్నమెంట్ వాకర్స్ అసోసియేషన్ ప్రాంగణం శశి కాలేజి ప్రక్కన ఎం.సి.జి.క్రికెట్ గ్రౌండ్ లో జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.టీములు ఈనెల 17 లోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. టోర్నమెంట్ 19 నుండి ప్రారంభం అవుతుందన్నారు. విజేతలకు మొదటి బహుమతిగా రూ.30వేలు, రెండవ బహుమతి రూ.20వేలు, ప్లేయర్ ఆఫ్ ది సీరీస్ రూ.6వేలు, బెస్ట్ బ్యాట్స్ మెన్ రూ.3వేలు, బెస్ట్ బౌలర్ రూ.3వేలు అందజేస్తారని తెలిపారు.టోర్నమెంట్ లో పాల్గొనదలచిన వారు 8712757657, 9949966551, 7997936663 లకు ఫోన్ చేసి లేదా నేరుగా కలిసి రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సిందిగా తెలిపారు.

ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలి

విశాలాంధ్ర-టి నరసాపురం: ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని జడ్పీటీసీ సభ్యులు సామంతపూడి బాల సూర్యనారాయణ రాజు అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో చెత్త సేకరణ డస్ట్ బిన్ లను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి 40500 డస్ట్ బిన్లు వచ్చినట్లు ఆయన తెలిపారు. తడి,పొడి చెత్త సేకరించడానికి ప్రతి ఇంటికి రెండు డస్ట్ బిన్లు పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. సేకరించిన చెత్తను డంపింగ్ యాడ్ లకు తరలించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దారబోయిన లక్ష్మీ వెంకటేశ్వరరావు,స్థానిక సర్పంచ్ మోదుగు సునంద, ఎంపిటిసిలు నార్లపాటి వెంకటేశ్వరరావు,అర్జా బాలయ్య, ఎంపిడీఓ కె జోగేశ్వర రావు, పంచాయతీ విస్తరణ అధికారి రాంప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా తయారు చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

విశాలాంధ్ర-టి నరసాపురం: నాటుసారా తయారు చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లుగా హెడ్ కానిస్టేబుల్ ఎం. రాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మధ్యాహ్నపువారిగూడెం గ్రామ శివార్లలో నాటుసార తయారు చేస్తున్నారనే సమాచారంతో తన సిబ్బందితో బుధవారం దాడి చేసి 800లీటర్లు బెల్లం ఊటను ధ్వంసం చేసి 20 లీటర్లు నాటుసార నాటుసార తయారు చేసే సామాగ్రి స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

ఓట్ల తొలగింపునకు ఫారం-7కి 0.1 శాతం మించిన దరఖాస్తుల పరిశీలనకు ప్రత్యేక బృందాలు

కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్

విశాలాంధ్ర-ఏలూరు: నియోజకవర్గ పరిధిలో ఫారం-7 కి దరఖాస్తులు 0.1 శాతం కన్నా ఎక్కువ వస్తే ఆ ఓట్లను తొలగింపు పరిశీలనకు రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ తెలిపారు. ఏలూరు జిల్లా ఓటర్ల జాబితాలోని అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్ లోని గౌతమి సమావేశ మందిరంలో బుధవారం జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ సమావేశం నిర్వహించారు. సమా వేశంలో జిల్లా రెవిన్యూ అధికారి డి. పుష్పమణి, కలెక్టరేట్ ఏవో కె. కాశీవిశ్వేశ్వరరావు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు డి. రత్నబాబు(బిఎస్‌పి), నెరుసు నెలరాజ(బిజెపి), పి. ఆదిశేషు(సిపిఎం), ఆర్. సత్యనారాయణ(ఆమ్ ఆద్మీ), పాలి ప్రసాద్(టిడిపి),కలవకొల్లు సాంబ(వైఎస్ఆర్ సిపి) తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇటీవల విడుదల చేసిన తుది ఓటర్ల జాబితా పరిశీలన చేసిందీ లేనిదీ ఆయా రాజకీయపక్షాల ప్రతినిధులను కలెక్టర్ ఆరా తీశారు.ఈ సంద ర్భంగా జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో ఫారం-7 కి ధరఖాస్తులు 0.1 శాతం లోపు, పైన ఉంటే వాటిని పరిశీలించేందుకు జిల్లా స్థాయిలో డిప్యూటీ కలెక్టర్లతో కూడిన రెండు బృందాలను నియమించామన్నారు. జిల్లాలో ఫిబ్రవరి 14వ తేదీ నాటికి అందిన దరఖాస్తుల్లో 17,010 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయన్నారు.

ఏపీ నిట్‌ను ప్రగతి పథంలో నిలిపేందుకు కృషి

విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం రూరల్ : నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆంధ్రప్రదేశ్ (ఏపీ నిట్)ని సిబ్బంది సహకారంతో ప్రగతి పథంలో నిలిపేందుకు కృషి చేస్తానని ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ బిఎస్.మూర్తి తెలిపారు. హైదరాబాద్ ఐఐటి డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఈయనకు కేంద్రప్రభుత్వం ఏపీ నిట్ ఇంచార్జ్ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో బిఎస్.మూర్తి ఇన్‌చార్జి డైరెక్టర్ గా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు నాగపూర్ ఎన్ఐటి డైరెక్టర్ డాక్టర్ ఎం.ప్రమోద్ పడోలే నిట్ ఇన్‌చార్జిగా వ్యవహరించారు. ఈ సందర్భంగా బిఎస్.మూర్తి విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ దేశ ప్రగతిలో విద్యార్థుల భాగస్వామ్యం అత్యంత కీలకమైనదన్నారు. ప్రజలకు మేలు చేసే విభిన్న పరిశోధనలు, ప్రాజెక్టులపై దృష్టిసారించాలని తెలిపారు. దేశంలో 31వ నిట్ గా అవతరించిన ఏపీ నిట్ ను టాప్ 10లోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని చెప్పారు. ముందుగా రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్ రెడ్డి, మూర్తికి పుష్పగుచ్ఛం అందజేసి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డీన్ లు డాక్టర్ జి.ఆర్.కే శాస్త్రి, డాక్టర్ టి.కురుమయ్య, డాక్టర్ ఎన్.జయరామ్, డాక్టర్ జీబి వీరేష్ కుమార్, డాక్టర్ కార్తీక్ శేషాద్రి, ఆచార్యులు డాక్టర్ వి.సందీప్, డాక్టర్ కృష్ణమూర్తి, డాక్టర్ రాముడు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల ధర్నా

విశాలాంధ్ర - ఉంగుటూరు : ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం బుధవారం ఉంగుటూరు మండలంలో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జి ధరించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తాహసిల్దారు కార్యాలయం వద్ద ధర్నా చేసి ఇన్ చార్జి తహసిల్దార్ బొడ్డేపల్లి దుర్గాప్రసాద్ వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాంబాబు, దాకి జోగి నాయుడు, జిల్లా కార్యదర్శి సిహెచ్ శ్రీధర్, సీతాల సత్యనారాయణ, బొమ్మిడి ప్రసాద్, పాల్గొన్నారు.

బంగారం చోరీపై కేసు నమోదు

విశాలాంధ్ర-టి నరసాపురం : బంగారం చోరీపై కేసు నమోదు చేసినట్లుగా ఎస్ఐ డి. దుర్గా మహేశ్వర రావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం తెడ్లం గ్రామానికి చెందిన కేతిరెడ్డి సత్యన్నారాయణ రెడ్డి హైదరాబాద్ లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ తెడ్లంలోని తన ఇంటికి వచ్చి బీరువా చూడగా దాచిన 9 కాసుల బంగారం కనిపించలేదు. అదే గ్రామానికి చెందిన వ్యక్తిపై అనుమానంతో ఫిర్యాదు చేయగా బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

శ్రీసూర్య స్కూల్‌లో ఘనంగా సామూహిక అక్షరాభ్యాసం

విశాలాంధ్ర-నర్సాపురం: పట్టణంలో శ్రీసూర్య ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ వారు నిర్వహించిన సామూహిక అక్షరాభ్యాస మహోత్సవం ఘనంగా జరిగింది. వసంత పంచమి పర్వదినాన్ని పురస్కరించుకొని పాఠశాల ఆవరణలో సరస్వతి పూజ, అక్షరా భ్యాస కార్యక్రమాలు శోభాయమానంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నరసాపురం అశ్విని హాస్పిటల్ డాక్టర్ పద్మావతి జ్యోతి ప్రజ్వలన చేసారు. ఎన్నో విశిష్ట యాగాలు నిర్వహించిన ప్రముఖ సిద్ధాంతి శ్రీపెద్దింటి అనిల్ కుమార్ ఆచార్యులు గణపతి సరస్వతుల పూజలు నిర్వహించి, వందలాదిగా విచ్చేసిన చిన్నారుల చేత అక్షరాభ్యాసం చేయించారు. .శ్రీసూర్య స్కూల్ కరెస్పాండెంట్ ఘంటసాల బ్రహ్మాజీ , స్కూల్ డైరెక్టర్ ఘంటసాల హేమవల్లి, అకడమిక్ అడ్వైజర్ బోయి రామచంద్ర రెడ్డి, సీనియర్ అధ్యాపకులు డాక్టర్ కాసా జానకి రామ్, స్కూల్ ఇంచార్జ్ దాసరి శ్రీకళ,స్కూల్ ఎఒ పులపర్తి శ్రీనివాస్, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, తల్లిదండ్రులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సిపిఎస్ విధానం అమలు కోరుతూ 18న చలో విజయవాడ

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: పాత పెన్షన్ విధానం అమలు కోరుతూ ఈ నెల18న చేపట్టిన చలో విజయవాడ ఓట్ ఫర్ ఓపియస్ ను జయ ప్రదం చేయాలని ఏపి సిపీయస్ ఈఏ రాష్ట్ర కార్యదర్శి ఆర్. నాగ దుర్గారావు పిలుపునిచ్చారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల వద్ద బుధవారం ఈ నెల18 జరిగే చలో విజయవాడ ఓట్ ఫర్ ఓపియస్ గోడ పత్రికలను ఉపాధ్యాయ సంఘాల నాయకుల చేతుల మీదుగా అవిష్కరించారు. ఈ సందర్భంగా ఏపీ సిపీయస్ ఈఏ రాష్ట్ర కార్యదర్శి ఆర్ .నాగ దుర్గారావు మాట్లాడుతూ ఏపీ ప్రభుత్వం సిపీయస్ ఉద్యోగులను మోసం చేసిందని, కనీసం సిపీయస్ ఉద్యోగులకు ఇవ్వ వలసిన డిఏ బకాయిలు ఒక్కటి కూడా ఇవ్వలేదన్నారు.దళిత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు యల్. జయరాజు మాట్లాడుతూ పాత పెన్షన్ విధానం కోరితే అప్రెంటీస్ విధానం తెచ్చారని అన్నారు.ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడు ఐవి రత్నం మాట్లాడుతూ పాత పెన్షన్ అమలయ్యే వరకు తమ పోరాటం సాగుతుందని అన్నారు.యుటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ తక్షణమే ఉద్యోగులకు ఇవ్వవలసిన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోరుతుంటే ప్రభుత్వం కొత్త సమస్యలను సృష్టిస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాంబాబు ,ఏసురత్నం , షరీఫ్ , సంతోషి , పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: జగనన్న ఆరోగ్య సురక్ష సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ బత్తిన నాగలక్ష్మి కోరారు. పట్టణంలోని 7వ సచివాలయం పరిధిలో ఉన్న ప్రజలకు స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు పట్టణ వైసీపీ అధ్యక్షుడు చిటికెల అచ్యుతరామయ్య అధ్యక్షత వహించారు.ముఖ్య అతిథిగా విచ్చేసిన మున్సిపల్ చైర్ పర్సన్ బత్తిన నాగలక్ష్మి మాట్లాడుతూ పట్టణంలోని అన్ని సచివాలయాల పరిధిలో ప్రజలకు అందుబాటులో ఉండేలా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతీ ఒక్కరూ ఈ ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ఉపయోగించుకోవాలని కోరారు. వైసీపీ చింతలపూడి నియోజకవర్గ ఇన్‌చార్జి కంభం విజయ రాజు మాట్లాడుతూ ఎంతో విలువైన వైద్యాన్ని ప్రజల ఇళ్ళ ముందుకు తీసుకు వచ్చిన ముఖ్యమంత్రి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి పోతారని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, స్త్రీ,శిశు సంక్షేమ శాఖ రీజనల్ చైర్మన్ వందనపు సాయిబాల పద్మ, ఉభయగోదావరి జిల్లాల బూత్ కమిటీ రీజనల్ కోఆర్డినేటర్ బివిఆర్. చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన క్రైస్తవుల ఉపవాస దీక్షలు

విశాలాంధ్ర-ఆగిరిపల్లి: క్రైస్తవ లోకానికి అత్యంత పవిత్రమైన కాలం లెంట్ అని పాస్టర్ కె.ఐజక్ జాన్ తెలిపారు.మండల పరిధిలోని కనసానపల్లి పరిశుద్ధ పౌలు సిఎస్ఐ చర్చిలో బుధవారం క్రైస్తవ ఉపవాస ప్రార్ధనలను భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు. ఈ సందర్భంగా పాస్టర్ మాట్లాడుతూ లెంట్ లోని ప్రారంభ దినం బుధవారం నుంచి ఈస్టర్ ముందు రోజు వరకు 40 రోజుల మండల కాలములో క్రైస్తవులు ఉపవాసం ఉండే రోజులు అని తెలిపారు. క్రీస్తు లోక రక్షణార్థమై శ్రమ పొందిన ఈ దినాల్లో ప్రభువు సిలువ శ్రమలను ఉపవాసం ఉండి ధ్యానించుట మంచిది అని తెలిపారు. క్రైస్తవులు ఈ 40 రోజులను గొప్ప సదవకాశం గా భావించి పవిత్ర ఉపవాస ప్రార్ధనల్లో పాల్గొని ఆత్మీయ మేలులు, ఆత్మీయ బలం పొందాలని కోరారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు సంఘస్తులు విశ్వాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మానవాళికి క్రీస్తు ఆదర్శం

విశాలాంధ్ర - లింగపాలెం : మానవాళికి ఏసుక్రీస్తు ఆదర్శమని, ఆయన మార్గంలో ప్రతీ ఒక్కరు జీవనం సాగించటం వల్ల సమాజంలో ప్రశాంతత ఉంటుందని క్రైస్తవ మత గురువులు బోధించారు. క్రైస్తవులకు విబూధి బుధవారం పవిత్రమైనదని పేర్కొన్నారు. బైబిల్ గ్రంధములో ఉన్న విధంగా క్రీస్తు శిలువలో మృతి చెందే ముందు 40 రోజులు ఏకాంత ఉపవాస ప్రార్ధనలు చేసిన త్యాగమూర్తిగా నిలిచారని అన్నారు. ఈ పర్వదినం సందర్భాన్ని పురస్కరించుకుని క్రైస్తవ విశ్వాసులు మాలధారణ చేశారు. 40 రోజులపాటు వీరంతా పవిత్రంగా జీవనం సాగిస్తారు. ప్రార్ధనా జీవితాన్ని గడుపుతారు. ఉపవాస ప్రార్ధనలు చేస్తారు. ఈ సందర్భంగా వీరిని ఆశీర్వదిస్తూ మత గురువులు ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. లింగపాలెం మండలంలో యువత, పెద్దలు, వృద్ధులు, మహి ళలు, పురుషులు పెద్ద సంఖ్యలో మాలధారణ చేపట్టారు. పర్వదినాన్ని పురస్కరించుకుని ఆర్‌సీఎం, సీఎస్ఐ దేవాలయాలలో ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. ఆర్‌సీఎం మత గురువులు ఆనంద్, రాజు, ఏసురత్నం, యోహాను, బాలరాజు, సీఎస్ఐ మత గురువులు జగన్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

షిరిడి సాయినాథ్ ఆలయంలో సరస్వతిపూజ

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి షిరిడి సాయినాథ్ ఆలయంలో బుధవారం సరస్వతీ పూజ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు అగ్నిహోత్రం సత్యనారాయణ చార్యులు అమ్మవారికి అభిషేకాలు, వివిధ పూజా కార్యక్రమాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. విద్యార్థులకు పుస్తకాలు , పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు దాపర్తి కాశీ విశ్వనాథం, గుడ్ల వెంకటేశ్వరరావు, కాల్దారి శివ, తీగల నారాయణమ్మ, బలుసు సత్యనారాయణ, విజయలక్ష్మి దంపతులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. దేవరపల్లి మండలం పల్లంట్ల గ్రామానికి చెందిన బలుసు సత్యనారాయణ, విజయలక్ష్మి దంపతులు పూజా కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులకు పెన్నులు, పుస్తకాలు పంపిణీ చేశారు.

అక్షరలో సామూహిక అక్షరాభ్యాసం

విశాలాంధ్ర - జగ్గంపేట : మాఘమాసం శ్రీ పంచమిని పురస్కరించుకుని చిన్నారులచే సరస్వతి దేవికి పూజ, హెూమం నిర్వహించి, సామూహిక అక్షరాభ్యాసం చేయించడం జరిగిందని పురోహితులు ప్రసాద్, సురేష్ శర్మ తెలిపారు. జగ్గంపేట అక్షర విద్యాలయ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో బుధవారం ఉచిత సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ అక్షరాభ్యాసం కార్యక్రమానికి వివిధ ప్రాంతాలకు చెందిన తల్లిదండ్రులు తమ చిన్నారులను తీసుకువచ్చి పురోహితుల మంత్రోచ్చారణతో సరస్వతీ దేవికి పూజలు నిర్వహించి అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా పురోహితులు మాట్లాడుతూ ఇవి సరస్వతి దేవి నవరాత్రులు అని, వీటినే శ్యామల నవరాత్రులు అని కూడా అంటారన్నారు. ఈ నవరాత్రుల్లో వచ్చే పంచమిని సరస్వతి దేవి పుట్టినరోజుగా జరుపుకోవడం జరుగుతుందన్నారు. ఈ పుట్టినరోజున సరస్వతి దేవుని పూజిస్తే మంచి విద్య, జ్ఞానము కలుగుతుందన్నారు. చిన్నారులు వృద్ధిల్లోకి రావాలని శ్రీ అక్షర విద్యాలయ వారు ఈ సామూహిక అక్షరాభ్యాసాన్ని నిర్వహించారన్నారు. ఈ పాఠశాల ప్రాంగణంలో సరస్వతి దేవికి పూజ నిర్వహించడం ద్వారా అక్షరాభ్యాసం చేసిన చిన్నారులతో పాటు ఇక్కడ చదివే విద్యార్థులకు అమ్మవారి ఆశీస్సులు పొందుతారన్నారు. ఈ కార్యక్రమంలో విద్యా సంస్థల ప్రిన్సిపాల్ ఆళ్ల రవికిషోర్, శ్రీనివాస్, స్కూల్ ఉపాధ్యాయులు, సిబ్బంది, పాల్గొన్నారు.

ఆలయ ప్రతిష్ఠ

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి మండలం ఎర్నగూడెం లో నూతనంగా నిర్మించిన అలివేలుమంగా పద్మావతి సమేత శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రతిష్టకు బుధవారం రాష్ట్ర హెూం శాఖామంత్రి తానేటి వనిత రాటపాతి కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. దేవరపల్లి మండలం ఎర్నగూడెంలో పారిశ్రామికవేత్త శ్రీకాకుళం కాశీ విశ్వనాథం రోహిణి దంపతులు దాదాపు కోటి యాభై లక్షల వ్యయంతో గ్రామస్తులు సహకారంతో నూతనంగా ఈ ఆలయం నిర్మించారు.

మనోధైర్యంతో క్యాన్సర్ మహమ్మారిని జయించవచ్చు

విశాలాంధ్ర - రాజానగరం : క్యాన్సర్(కర్కరోగం)సోకిన వ్యక్తులకు అదిలోనే గుర్తించడంతో పాటుగా మనోధైర్యంతో నిలబడితే సులభంగా క్యాన్సర్ మహమ్మారిని జయించవచ్చని విజయవాడకు చెందిన అమెరికన్ ఆంకాలజీ ఇన్స్టిట్యూట్(ఏవోఐ) ప్రముఖ వైద్యులు డాక్టర్ సృజన జోగా అన్నారు. మండలంలోని గైట్ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ, ఏవోఐ సంయుక్త ఆధ్వర్యంలో క్యాన్సర్ వ్యాధి పై తీసుకోవాల్సిన జాగ్రత్తలు అనే అంశంపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ క్యాన్సర్ ను ముందుగా గుర్తించడం ద్వారా నష్టం వాటిల్లే ప్రమాదం తగ్గుతుందన్నారు. క్యాన్సర్ వ్యాధిలో అనేక రకాలు ఉన్నాయని,వాటిని గుర్తించే పరీక్షలు,క్యాన్సర్ కారకాలు, పోషక ఆహారం, రోజువారీ వ్యాయామం చేయడం ద్వారా కర్కరోగం రాకుండ జాగ్రత్త పడవచ్చునని సూచించారు. క్యాన్సర్ స్క్రీనింగ్ విదానాలు, వైద్య పరీక్ష విదానాలు, పిఎస్ఎ పరీక్ష, సిటి స్కానింగ్,గురించి వివరించారు. గర్భాశయ క్యాన్సర్,డోసేజ్ ఎపుడు ఎవరు ఎలా తీయాలి,క్యాన్సర్ చికిత్స విదానాల గురించి తెలిపారు. అనంతరం ముఖ్య అతిథిగా విచ్చేసిన వైద్యులు సృజనకు గైట్ ఫార్మసీ ఆధ్వర్యంలో దుశ్శలువ కప్పి జ్ఞాపిక అందజేశారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.ఎండి ధనరాజు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రామ చంద్రన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి షేక్ మీరా,ఏవోఐ వైద్యులు,సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో చలమలశెట్టి సునీల్‌కు ఘన స్వాగతం

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : కాకినాడ పార్లమెంటు నియోజకవర్గ వైఎస్ఆర్సిపి ఇన్‌చార్జ్ చలమలశెట్టి సునీల్‌కు మరియు నియోజకవర్గ వైఎస్ఆర్సిపి ఇంచార్జ్ వరుపుల సుబ్బారావుకు వైసిపి పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. స్థానిక జాతీయ రహదారి సంతోషిమాత గుడివద్ద భారీ గజ మాలతో స్వాగతం పలికారు. జాతీయ రహదారిపై ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి భాణాసంచా కాల్చిన వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు వైసిపి నాయకులు కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. సునీల్ వైఎస్సార్ సీపీ కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా నియమితులై తొలిసారిగా ప్రత్తిపాడు నియోజకవర్గంలోకి అడుగు పెట్టారు. అనంతరం సునీల్ ప్రత్తిపాడులో వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల ఏసి నివాళులర్పించారు. సునీల్ మధురపూడి విమానాశ్రయం నుంచి భారీ కారులతో ర్యాలీగా జాతీయరహదారి మీదుగా అన్నవరం వెళ్లి సత్యదేవున్ని దర్శించుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి దొరబాబు, సర్పంచులు ఎంపీటీసీలు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు సునీల్ అభిమానులు భారీ ఎత్తున పాల్గొన్నారు.

జీ తెలుగులో వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్‌గా గద్దర్ 2

విశాలాంధ్ర - తూర్పు గోదావరి : బాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద వసూళ్ల సునామీ సృష్టించిన గదర్2ని వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్ గా తెలుగులో ప్రసారం చేయనుందనీ సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఎమోషనల్ఎంటర్టైనర్ గదర్ 2, ఈ నెల 18 వ తేది సాయంత్రం 5:30 గంటలకు, మీ జీ తెలుగులో వినియోగదారులకు అందుబాటులో ఉంటుందన్నారు. అనిల్ శర్మ దర్శకత్వంలో 2001లో వచ్చిన బ్లాక్ బస్టర్ గదర్, ఏక్ ప్రేమ్ కథ'కు సీక్వెల్గా ఈ సినిమా తెరకెక్కిందన్నారు. బాలీవుడ్ స్టార్యాక్టర్స్ సన్నీ డియోల్, అమీషా పటేల్, ఉత్కర్ష్ శర్మ నటించిన ఈ చిత్రం 1971 ఇండో-పాకిస్థాన్ యుద్ధంలో తారా సింగ్ (సన్నీ డియోల్)ప్రయాణమే ప్రధాన ఇతివృత్తంగా తెరకెక్కిందని వివారించారు.జైలులో ఉన్న తన కుమారుడు చరణ్జీత్సింగ్ (ఉత్కర్ష్ శర్మ) ను రక్షించడానికి పాకిస్థాన్ నుంచి తిరిగివచ్చిన తారా సింగ్ఎలాంటి పరిస్థితులు ఎదుర్కొన్నాడనేది ఈ సినిమా కథన్నారు. థియేట్రికల్ రిలీజ్బక్సెస్ తర్వాత 18న సాయంత్రం 5:30 గంటలకు జీ తెలుగులో ప్రసారం కానున్న 'గదర్ 2' ప్రేక్షకులకు అదిరిపోయే వినోదాన్ని పంచడానికి సిద్ధమైందన్నారు.తెలుగు ప్రీమియర్గా ప్రసారం కానున్నబాలీవుడ్ బ్లాక్ బస్టర్ సినిమా గదర్ 2ని జీ తెలుగు వేదికగా ఈ వారాంతంలో వీక్షకులందరూ మిస్సవకుండా వీక్షించాలన్నారు.

జనం కోసం పవన్-పవన్ కోసం మనం

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ రూరల్ నియోజకవర్గం కరప మండలం వలసపాకల గ్రామం కొత్తపేట, పాతపేట, (శెట్టిబలిజ ప్రాంతం) మరియు గొల్లపేట ప్రాంతాలలో జనం కోసం పవన్-పవన్ కోసం మనం కార్యక్రమం ద్వారా ఉమ్మడి కార్యాచరణలో భాగంగా స్థానిక జనసేన నాయకులు ఎం. శివ, వి. నూకరాజు, ఆధ్వర్యంలో ఇంటింటికి పాదయాత్ర చేస్తూ ప్రజా సమస్యలు తెలుసుకుంటూ ఉన్న జనసేన పార్టీ పిఎసి సభ్యులు, కాకినాడ రూరల్ ఇంచార్జ్ పంతం నానాజీ, తెలుగుదేశం నాయకులు దేవు వెంకన్న, ఎస్‌సి నాయకులు ఇమాన్యూల్ ఈ సందర్భంగా పర్యటన చేస్తున్న నాయకులకు ఈ గ్రామంలోని ఎస్‌సి పేటలో త్రాగునీరు లేదని నేటికీ మంచినీరు బావి నుండీ తెచ్చుకోవాలని, డ్రైనేజీ వ్యవస్థ లేదని, పారిశుధ్యం పట్టించు కోవడం లేదని, ఎస్‌టి ఎరుకులకు సంక్షేమ పథకాలు ఇవ్వకుండా వైసీపీ నాయకులు దూరం పెట్టేరని, సీసీ రోడ్లు నిర్మాణంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించి వైసీపీ నాయకులు అక్రమంగా బిల్లులు చేసుకుంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక జనసేన నాయకులు, జనసేన యువత మరియు తెలుగుదేశం నాయకులు, రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ స్థాయి నాయకులు, జనసైనికులు, వీరమహిళలు పాల్గొన్నారు.

ఐదుగురు అన్నదమ్ములకు షష్టి వేడుక

విశాలాంధ్ర - కాట్రేనికోన : షష్టి వేడుక నిర్వహించుకోవడం అంటే అది మనిషి జీవితంలో మహా అద్భుతమైన అవకాశం. తల్లిదండ్రుల సమక్షంలో ఐదుగురు కుమారులు షష్టి వేడుకలు నిర్వహించుకున్న సంఘటన కాట్రేనికోన మండలం పరిధిలోని నడవపల్లిలోబుధవారం జరిగింది. అల్లూరి సుబ్బరాజు, అన్నపూర్ణమ్మ దంపతులకు వెంకటరమణ రాజు, సత్యనారాయణ రాజు, సూర్యనారాయణ రాజు, సుబ్రహ్మణ్యం రాజు, శ్రీరామరాజు అయిదుగురు కుమారులు. అందరికీ 60 సంవత్సరాలు దాటాయి. దీంతో వారందరూ సతీ సమేతంగా హాజరై బుధవారం షష్టి వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. హెూమం నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. ఈ కుటుంబాన్ని పలువురు అభినందించారు.

ఆదిత్యలో ఘనంగా వసంత పంచమి పూజలు



విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య విద్యా ప్రాంగణంలో గల సరస్వతి దేవి నిలయం నందు ది.14-2-2024 బుధవారం "వసంత పంచమి" సరస్వతీ దేవి జన్మదినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి, లక్ష్మీ రాజ్యం దంపతుల ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు శ్రీరామ్ శర్మ వేదోక్త మంత్రాల మధ్య ఉదయం 6-00 గంటలకు విఘ్నేశ్వర పూజ, 6-30 గం.లకు సరస్వతి అమ్మవారికి విశేష అభిషేకములు, 9-31ని.లకు సామూహిక అక్షరాభ్యాసాలు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం 6-30గం.లకు సామూహిక కుంకుమార్చన, సహస్ర పుష్పార్చన, 8-00 గం.లకు నక్షత్ర హారతి, నీరాజనం మంత్రపుష్పం ప్రసాద వితరణ కార్యక్రమాలతో ముగిసాయి. ఈ కార్యక్రమంలో ఆదిత్య అధినేతలు డా నల్లమిల్లి శేషారెడ్డి, లక్ష్మీరాజ్యం దంపతులు, వైస్ చైర్మన్ డా ఎన్ సతీష్ రెడ్డి, వివిధ కళాశాలల ప్రిన్సిపాల్‌లతో పాటు ఆదిత్య సిబ్బంది విద్యార్థినీ, విద్యార్థులు, వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పాల్గొన్నారు.

మహాలక్ష్మి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ

విశాలాంధ్ర - కరప : కరప మండలం గొడ్డటిపాలెం గ్రామంలో శ్రీ మహాలక్ష్మి అమ్మవారు విగ్రహ ప్రతిష్ఠ కాకినాడ రూరల్ శాసనసభ్యులు కురసాల కన్నబాబు దంపతుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగిందని గ్రామ సర్పంచ్ వాసంశెట్టి శ్రీనుబాబు తెలిపారు. అనంతరం వెయ్యి మంది భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు సర్పంచ్ శ్రీనుబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో చింతా ఈశ్వరరావు ఎంపీపీ శ్రీలక్ష్మి సత్తిబాబు, జడ్పిటిసి వై.సుబ్బారావు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు నాయకులు పాల్గొన్నారు.

విలసవిల్లిలో జగనన్న సురక్ష

విశాలాంధ్ర - ఉప్పలగుప్తం : ఉప్పలగుప్తం మండలం విలసవిల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం జరిగిన రెండవ విడత జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ సలాది ఊర్మిళ దేవి, వైసిపి గ్రామ కమిటీ అధ్యక్షులు సలాది సతీష్, జడ్పిటిసి గెద్దం సంపద రావు, కార్యదర్శి దాసరి కృష్ణాజీ, ఉంగరాల నాగేశ్వరరావు, ముత్యాల వెంకట నారాయణ, డాక్టర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, వలంటీర్ తదితరులు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశంలో పలు సమస్యలపై నాయకుల మండిపాటు

విశాలాంధ్ర -పెరవలి : బుధవారం పెరవలి మండల పరిషత్ కార్యాలయం వద్ద జరిగిన సర్వసభ్య సమావేశంలో కొందరు ప్రజాప్రతినిధులు అధికారులపై మండిపడ్డారు. మండల అధ్యక్షులు కార్చర్ల సీతారామ్ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈసమావేశంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు ఆయా శాఖల ద్వారా జరుగుతున్న పనులను వివరించారు. ఈసందర్భంగా ఖండవల్లి యంపిటీసీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ లంకమాలపల్లి ప్రాంతంలో పంటకాలువ పూడిక పనులు చేపట్టడం లేదన్నారు. జగనన్న కాలనీలో ఎన్నిసార్లు చెప్పినా విద్యుత్ లైన్లు వేయడంలేదని అధికారులను నిలదీశారు. కానూరు సర్పంచ్ మధు మాట్లాడుతూ కానూరు గ్రామంలో యన్ ఆర్ ఇ జియస్ మేట్ గా ఎక్కువకాలం ఎవరూ పనిచేయడం లేదని అందుకు ఆగ్రామంలో గల కొందరు నాయకుల వత్తిడిఅని దానివలన ఆగ్రామంలో ఉపాధిహామీ పనులు చేయించుకోవడం ఇబ్బందిగా మారిందని అన్నారు. పెరవలి యంపిటిసి ప్రమీల మాట్లాడుతూ నిడదవోలు నుండి పెరవలి ఆర్టీసీ బస్ సర్వీస్లు క్రమంగా జరిగేలా చూడాలని అధికారులను కోరారు. ఈకార్యక్రమంలో అధికారులు నాయకులు పాల్గొన్నారు.

కృష్ణవేణికి టీచర్ల ఆత్మీయ సన్మానం

విశాలాంధ్ర - కరప : స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో జిల్లా ఉత్తమ అవార్డు అందుకున్న ఎంఈఓ కెబి కృష్ణవేణికి ఘనంగా సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కన్నబాబు ముఖ్య అతిథిగా పాల్గొని ఎంఈఓ కృష్ణవేణి గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ కష్టపడి పని చేసే వారికి ఎప్పుడూ గుర్తింపు ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి వై.సుబ్బారావు, ఎంపీపీ శ్రీలక్ష్మి సత్తిబాబు, సర్పంచ్ ఆశాజ్యోతి, ఉపాధ్యాయులు అలీం, శివ ప్రసాద్, సాయి మోహన్, ఎమ్మార్సీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పీపుల్ సర్వీస్ ఆర్గనైజేషన్ సేవలు అభినందనీయం

విశాలాంధ్ర - ముమ్మిడివరం : పీపుల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సంస్థ సభ్యులు ఎన్. స్టీఫెన్ బాబు వారి కుటుంబ సభ్యులు ఆర్థిక సహాయంతో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలకు, ముమ్మిడివరం నగర పంచాయతీ మున్సిపాలిటీ పారిశుధ్య కార్మికులకు దుప్పట్లు, చీరలు 150 మందికి పైగా పంపిణీ చేశారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కన్వెన్షన్లో పీపుల్ సర్వీస్ ఆర్గనైజేషన్ గౌరవాధ్యక్షులు టి.నాగరాజారావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఓఎన్జిసి ఎస్సి మరియు ఎస్టి ఎంప్లాయిస్ చైర్మన్ కె. సత్యనారాయణ మాట్లాడుతూ పీపుల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేసి ఉన్నారని వారి సేవలు అభినందించ దగ్గ విషయమని తెలియజేశారు. మండల విద్యాశాఖ అధికారి రమణశ్రీ మాట్లాడుతూ పాఠశాలలో పనిచేస్తున్న ఆయాలకు దుప్పట్లు, చీరలు ఇవ్వడం గొప్ప విషయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పీపుల్ సర్వీస్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు కె వెంకటేశ్వరరావు, ఓఎన్జిసి అధికారి యస్. రాజకుమార్, ప్రసాద్ ఎం. ఆశీర్వాదం, తదితరులు పాల్గొన్నారు.

27వరకు ఉద్యమ కార్యాచరణ

విశాలాంధ్ర - తాళ్ళపూడి : ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక పెన్షనర్ల సమస్యల పరిష్కారం కొరకు ఏపీ జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 14 నుండి 27 వరకు జరిగే ఉద్యమ కార్యాచరణను జయప్రదం చేయాలని కోరుతూ తమ డిమాండ్లను వెల్లడించారు. ఏ.పి.జే.ఏ.సి ఉద్యమ కార్యాచరణ ప్రకటన ప్రకారం అన్ని ఉపాధ్యాయ ఉద్యోగ సంఘాలు పాల్గొని విజయవంతం చేయాలని జే.ఏ.సి చైర్మన్ జోడాల వెంకటేశ్వర రావు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ 15, 16. తేదీ లలో నల్ల బ్యాడ్జీలను ధరించి మధ్యాహ్నభోజన విరామ సమయంలో కార్యాలయాలు వద్ద పాఠశాలలల్లో నిరసనలు తెల్పాలని, 17న తాలూకా కేంద్రములో తహశీల్దార్ ఆఫీసు వద్ద ధర్నా, 20 న జిల్లా కేంద్రంలో కలక్టరేట్ వద్దర్యాలీ, ధర్నా, 21 నుండి 24 వరకు రాష్ట్ర నాయకుల జిల్లాల పర్యటన, 27న చలో విజయవాడ చేస్తున్నట్లు ఉద్యమ కార్యాచరణ ప్రకటనలో తెలియచేశారు.

బ్యాంకు మేనేజర్లకు అవగాహన

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి పోలీస్ స్టేషన్ వద్ద బుధవారం జగ్గంపేట సిఐ లక్ష్మణరావు, గండేపల్లి ఎస్సై ఎన్.రామకృష్ణ ఆధ్వర్యంలో గండేపల్లి మండలంకు సంబంధించిన బ్యాంక్ మేనేజర్లకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ మధ్యకాలంలో ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ఉత్తర కంచి గ్రామంలో ఎస్బిఐ బ్యాంకు వద్ద రోబరీ జరిగిన కారణంగా, అలాంటి సమస్యలు తలెత్తకుండా ఉండాలని, ముందు జాగ్రత్త చర్యలుగా జగ్గంపేట సిఐ లక్ష్మణరావు బ్యాంక్ మేనేజర్లతో మీటింగ్ నిర్వహించారు. ప్రతి బ్యాంకు వద్ద సెక్యూరిటీ గార్డ్ తప్పనిసరిగా ఉండాలని, సీసీ కెమెరాలు సక్రమంగా పనిచేసేలా జాగ్రత్తలు తీసుకోవాలని, తదితర అంశాలపై బ్యాంక్ మేనేజర్లకు అవగాహన కల్పించారు.

బీమాభాయ్కు ఘన నివాళులు

విశాలాంధ్ర-కొవ్వూరు : నవభారత రాజ్యాంగం నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ తల్లి భీమబాయ్ 175వ జయంతిని పురస్కరించుకొని అంబేద్కర్ 125అడుగుల విగ్రహం వద్ద ఘనంగా నివాళులు అర్పించినట్టు మాలమహాసభ జాతీయ వర్కింగ్ ప్రసిడెంట్ బొంతా శ్యామ్ రవి ప్రకాష్ తెలిపారు. అంటరాని తనం దేశంలో తాండవిస్తున్నపుడు అంబేద్కర్ గార్కి జన్మనిచ్చిన మహనీయురాలని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అంబటి కొండల రావు, దొడ్డి వెంకట్రావు, బొంతా తనోజ్, కావూరి రాజు తదితరులు పాల్గొన్నారు.

3న పల్స్ పోలియో

విశాలాంధ్ర -రాజమహేంద్రవరం రూరల్ : జిల్లాను పోలియో రహిత జిల్లా గా తీర్చి దిద్దుదామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, వైద్యాధికారులకు సూచించారు. బుధవారం స్థానిక శ్రీ వెంకటేశ్వర ఆనం. కళాకేంద్రంలో మార్చి 3 వ తేదీన నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమం పై వైద్యాధి కారులు, వైద్య సిబ్బంది తో నిర్వహించిన శిక్షణా కార్యక్రమానికి డిఎంహెచ్ఓ డాక్టర్ వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై పలు సూచనలు సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ డాక్టర్ కే. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో 0-5 సంవత్సరాలు గల పిల్లలు 1,88,772 ఉన్నారని వీరందరికీ పోలియో వాక్సిన్ వేయనున్నట్టు తెలిపారు. శిక్షణా కార్యక్రమంలో వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ మెంబర్ డాక్టర్ జాన్ జ్యూ డే జూసఫ్, జిల్లా ఇమ్యూనైజేషన్ ఆఫీసర్ డాక్టర్ ఎన్ రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

అత్యాధునిక వసతులతో బస్ కాంప్లెక్స్

విశాలాంధ్ర - అమలాపురం : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కేంద్రం అమలాపురంలో కోనసీమకే తలమానికంగా జిల్లా ప్రతిష్టను ఇనుమడింపజేసేలా నూతన బస్ కాంప్లెక్స్ టెర్మినల్ను విజయవాడ పండిట్ నెహ్రూ బస్టాండ్ మాదిరిగా అత్యాధునిక వసతులతో నిర్మించనున్నట్లు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంగణంలో సుమారు రూ.45 కోట్ల అంచనా వ్యయంతో ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో నిర్మించనున్న అత్యాధునిక స్టేషన్ బస్సు కాంప్లెక్స్ టెర్మినల్కు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి ఏపీఎస్ ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ సిహెచ్ ద్వారకా తిరుమలరావు, జోనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కే గోపీనాథ్ రెడ్డిలు శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ జిల్లా స్థాయికి తగిన రీతిలో ప్రజానీకం ప్రయాణానికి సౌకర్యవంతంగా ఉండేందుకై అన్ని రకాల మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. ఈ అత్యాధునిక బస్ స్టేషన్ టెర్మినల్ నిర్మాణం కొరకు తొలి దశలో రూ.5 కోట్ల నిధులు రాష్ట్ర రవాణా శాఖ ద్వారా కేటాయించడం జరిగిందన్నారు. ప్రస్తుతం ఉన్న కాంప్లెక్స్ భవనాన్ని తొలగించి దాని స్థానే అత్యాధునిక బస్ స్టేషన్ కాంప్లెక్స్ టెర్మినల్ను 24 ప్లాట్ ఫారాలతో పాటుగా మూడు అంతస్తులు ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంతో టెండర్లు పిలిచి కమర్షియల్ కాంప్లెక్స్ బ్లాకులు నిర్మించనున్నట్టు తెలిపారు. పూర్తి స్థాయిలో అన్ని వసతులతో ఈ టెర్మినల్ను నిర్మించనున్నట్లు మంత్రి విశ్వరూప్ స్పష్టం చేశారు. గ్రౌండ్ ఫ్లోర్ బస్ కాంప్లెక్స్ టెర్మినల్ 9 నెలల కాలంలో పూర్తి చేసి అందుబాటులో తేవడం జరుగుతుందని, మూడు అంతస్తులను ప్రభుత్వ ప్రవేట్ భాగస్వామ్యంతో ప్లానింగ్తో నిర్మించి కమర్షియల్గా ఇవ్వనున్నట్లు తెలిపారు.

ఆర్టీసీ ఎండీ సిహెచ్ ద్వారకా తిరుమలరావు మాట్లాడుతూ సమకాలీన పరిస్థితులకు అనుగుణంగా ఒకటి రెండు మూడు అంతస్తులను ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంతో టెండర్లు పిలిచి కమర్షియల్ బ్లాకులను నిర్మించనున్నట్టు తెలిపారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్సీలు ఇళ్ళ వెంకటేశ్వరరావు, బొమ్మి ఇజ్రాయిల్, ఆర్టీసీ రీజనల్ మేనేజర్ ఆర్వియస్ నాగేశ్వరరావు, ఏఎంసి చైర్మన్ దంగేటి డోలా మణి రుద్ర, మున్సిపల్ చైర్ పర్సన్ రెడ్డి సత్య నాగేంద్ర మణి, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ పట్ల అవగాహన పెంచుకోవాలి

విశాలాంధ్ర - కాకినాడ : ప్రతి విద్యార్థి శాస్త్రీయ పరిశోధనలపై అవగాహన పెంచుకోవాలని ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ సూచించారు. స్థానిక సాలిపేట బాలికోన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన జిల్లాస్థాయి ఇన్స్పైర్ అవార్డ్స్ 2022-23 కార్యక్రమం వేడుకగా సాగింది. కాకినాడ జిల్లా పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడా చైర్పర్సన్ రాగిరెడ్డి చంద్రకళా దీప్తి, నగరపాలక సంస్థ కమిషనర్ జె. వెంకటరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఇన్స్పైర్ అవార్డ్స్కు సుమారు 5440 నామినేషన్లు రాగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి 279, కాకినాడ జిల్లా నుంచి 132 మందిని ఎంపిక చేశారు. ఎంపికైన ప్రాజెక్టులకు డిపార్ట్మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ద్వారా రూ.పదివేలు చొప్పున ప్రోత్సాహకాన్ని అందిస్తారు. జిల్లాస్థాయిలో ఎంపికైన ప్రాజెక్టుల నుంచి సుమారు 13 మందిని ఎంపిక చేసి రాష్ట్రస్థాయికి పంపనున్నారు. అవార్డ్స్ కార్యక్రమానికి ముఖ్య అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కౌడా చైర్పర్సన్ రాగిరెడ్డి చంద్రకళ దీప్తి మాట్లాడుతూ ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లోని అంతర్గతంగా ఉన్న ప్రతిభా పాటవాలను వెలికి తీసేందుకు ఇటువంటి సైన్స్ ఎగ్జిబిషన్లు ఎంతగానో దోహదపడతాయన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ జె. వెంకటరావు మాట్లాడుతూ సరికొత్త ఆవిష్కరణలతో విద్యార్థులు మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన ఎగ్జిబిట్స్ అందరినీ ఆకట్టుకున్నాయి. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి పి రమేష్, ఎంఈఓ ఎల్ గణేష్ బాబు జిల్లా సైన్స్ అధికారి ఎమ్మెస్ వినీల్, వివిధ యాజమాన్యాలలోని విద్యార్థులు, అధికారులు పాల్గొన్నారు.

9న జాతీయ మెగా లోక్అదాలత్

విశాలాంధ్ర-కొవ్వూరు : మార్చి 9వ తేదీన కొవ్వూరు కోర్టుల వద్ద జాతీయ లోక్ అదాలత్ ను నిర్వహిస్తున్నట్లు తొమ్మిదవ అదనపు జిల్లా జడ్జి డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం స్థానిక కోర్టు హాల్లో పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్ అదాలత్లో అన్ని కేసులను పరిష్కరించుకోవచ్చు అన్నారు. కేసులను రాజీ చేసుకోవడం ద్వారా సమయాన్ని, డబ్బులు ఆదా చేసుకోవచ్చున్నారు. కేసుల రాజీ విషయమై పోలీసులు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో మెజిస్ట్రేట్ాలు జి. ఈశ్వరరావు, జి.సాయి కృష్ణ,పట్టణ సీఐ జగదీష్ కుమార్ ఎస్సైలు, కోర్టు కానిస్టేబుల్ పాల్గొన్నారు.

ఓటు హక్కును ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలి

విశాలాంధ్ర - ఏలేశ్వరం : ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సాయి బాలాజీ బిఈడి కళాశాల కరస్పాండెంట్ డివివి సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం నిర్వహించిన ఓటు అవగాహన ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. యుటిఎఫ్ సీనియర్ నేత మెతకాని రాంబాబు మాట్లాడుతూ ఓటు సామాన్యుని చేతిలో వజ్రాయుధమని, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని అన్నారు. తమ ఓటు దేశ దిశ నిర్దేశాలను శాసిస్తుందనే విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తించాలని పేర్కొన్నారు. అనంతరం బాలాజీ చౌక్ సెంటర్ మీదుగా మెయిన్ రోడ్డు, పురవీధులలో ర్యాలీ సాగింది. ఈ కార్యక్రమంలో విశ్రాంతి ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షుడు ఉద్దగిరి సోమరాజు, విఎస్ ఆస్మాండ్ మాస్టర్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి. రాజు, సుంకర హైమావతి, కే రాజమోహన్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్ సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర - ఆలమూరు : జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో వచ్చే నెల (మార్చి) 9న నిర్వహించే లోక్ అదాలత్ను సద్వినియోగం చేసుకోవాలని ఆలమూరు మండల న్యాయ సేవాధికార సంఘం చైర్మన్ వి. నాగేశ్వరరావు నాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ లోక్ అదాలత్ ఆలమూరు జూనియర్ సివిల్ జడ్జ్ కోర్ట్ ప్రాంగణమునందు నిర్వహిస్తామని, రాజీకి అనుకూలమైన క్రిమినల్, సివిల్ కేసులు ఇరు పార్టీల అంగీకారంతో పరిష్కరించనున్నామని, ఈ అవకాశాన్ని కక్షిదారులు వినియోగించుకోవా లని ఆయన కోరారు. పోలీస్ సిబ్బంది, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

అమరవీరులకు ఘన నివాళులు

విశాలాంధ్ర - పెద్దాపురం : పుల్వామా ఉగ్రదాడిలో మరణించిన వీర జవాన్లుకు పెద్దాపురం మండలం చంద్రమాంపల్లి జంక్షన్లో స్థానికులు, విద్యార్థులు బుధవారం ఘనంగా నివాళులర్పించారు. ఆజాద్ నేషనల్ ఆర్మీ అధ్యక్షులు కొత్తెం కోటి ఆధ్వర్యంలో అమర వీరులకు సంస్మరణ సభ ఏర్పాటు చేసి పుల్వామ ఉగ్ర దాడిలో మృతి చెందిన జవాన్ల వీర మరణాన్ని స్మరించుకుంటూ శాంతియుత సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కోటి మాట్లాడుతూ అమరవీరుల త్యాగాలు మరువలేమన్నారు. పుల్వామ ఘటన సందర్భంగానే ఫిబ్రవరి 14వ తేదీన బ్లాక్ డేగా పాటించడం జరుగుతుందన్నారు. అమరవీరుల ఆత్మకు శాంతి చేకూరాలని వారి చిత్రపటాలకు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మొయిళ్ల కృష్ణమూర్తి, శీలంగి బుజ్జి, తుమ్మల బుల్లియ్య, ఎగ్గాడ శ్రీను, తుమ్మల నాని, విద్యార్థులు, దుకాణ యజమానులు పాల్గొన్నారు.

మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్యకు కలెక్టర్ నివాళులు

విశాలాంధ్ర - కాకినాడ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రెండో ముఖ్యమంత్రిగా, తొలి దళిత ముఖ్యమంత్రిగా దామోదరం సంజీవయ్య రాష్ట్రానికి చేసిన సేవలు ఆదర్శనీయమని జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికాశుక్లా కొనియాడారు. మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతిని పురస్క రించుకుని జిల్లా సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బుధవారం కాకినాడ కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, జాయింట్ కలెక్టర్ సీవీ.ప్రవీణ్ ఆదిత్య, డీఆర్వో డి.తిప్పేనాయక్, జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు డోకుబుర్ర భద్రం, డాక్టర్ ఎం. పవన్ కుమార్ తదితరులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఇన్చార్జి జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి వై.వాణి, గిరిజన సంక్షేమ అధికారి ఎ. విజయ శాంతి, సాంఘిక సంక్షేమ శాఖ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు

విశాలాంధ్ర - మామిడికుదురు : ఇస్లాం మత వ్యవస్థాపకులు మహమ్మద్ ప్రవక్త మనవడు హజరత్ ఇమామ్ హుస్సేన్ జయం త్యుత్సవాన్ని పురస్కరించు కుని బుధవారం నగరం, రాజోలులో బుధవారం పలు సేవ కార్యక్రమాలు నిర్వహిం చారు. నగరం గ్రామానికి చెందిన గురుహే మోహిబ్బానే జహెరా యువజన సంఘం ఆధ్వర్యంలో రాజోలు ప్రభుత్వాసుపత్రులలోని రోగులకు పండ్లు,పాలు, రొట్టెలు పంపిణీ చేశారు. ఇమామ్ హుస్సేన్ సూచించిన ఉపదేశాల కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ ఏ సూర్యనారాయణ మరియు సంఘ సభ్యులు సయ్యద్ రూహి, అబ్బాస్ హుస్సైన్, జాఫర్ అబ్బాస్, అజీబ్ హుస్సేన్, మరియు ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

పుల్వామా అమరవీరులకు నివాళులు

విశాలాంధ్ర - మామిడికుదురు : 2019 పుల్వామాలో జరిగిన ఉగ్రవాదుల దాడుల్లో అశువులు బాసిన అమరవీరుల సేవలు ఎనలేనివని దీప్తి విద్యా సంస్థల కరస్పాం డెంట్ డివివి సత్యనారాయణ అన్నారు. బుధవారం మామిడికుదురులోని దీప్తి పాఠశాలలో అమరవీరులకు కొవ్వొత్తులతో ఘన నివాళులు అర్పించారు.

కూలీల కష్టాన్ని కాంట్రాక్టర్ బొక్కేసాడు

విశాలాంధ్ర - అమలాపురం : అయినవిల్లి మండలం పోతుకుర్రుకు చెందిన కూలీలు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు బుధవారం రెండవ రోజుకు చేరుకున్నాయి. పోతుకుర్రు జగనన్న లే అవుట్లో కాంట్రాక్టర్ కమిడి వెంకటేశ్వరరావు లే అవుట్ మెరక చేయించుకుని డబ్బులు ఇస్తానని నమ్మించి ఎగవేయడానికి నిరసనగా బాధితులు మంగళవారం నుండి లే ఆ వుట్ స్థలంలో రిలే నిరాహారదీక్షలు చేస్తున్నారు. ఈ దీక్ష శిబిరాన్ని జాతీయ మాల మహానాడు ప్రధాన కార్యదర్శి కొంకి వెంకట్రావు సందర్శించారు. ఈ సందర్భంగా బాధితులు గుత్తుల త్రిమూర్తులు, కాంట్రాక్టర్ కమిడి వెంకటేశ్వరావుని తక్షణమే అరెస్టు చేసి మా సమస్యను పరిశీలించి పరిష్కారం చెయ్యాలని మా డబ్బులు మాకు ఇప్పించండి మహాప్రభో అని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమానికి పలువురు స్థానిక నాయకులు మద్దతు తెలిపారు.

దుంప పంటను పరిశీలించిన శాస్త్రవేత్తలు

విశాలాంధ్ర - పెద్దాపురం : మెట్టలో సాగవుతున్న దుంప పంటను కేంద్రీయ దుంప పంటల పరిశోధనా కేంద్రం నుంచి తిరువనంతపురం (కేరళ) శాస్త్రవేత్తలు డాక్టర్ జి బైజు, డి జగ న్నాధన్, భువనేశ్వర్ శాస్త్రవేత్త డాక్టర్ నెడుంబిజియన్లు పరిశీలించారు. పెద్దాపురం దుంప పరిశోధన కేంద్రం, మండలంలోని రాయభూపాలపట్నం, కట్టమూరు గ్రామాల్లో కర్ర పెండలం దుంప సాగును బుధవారం దుంప పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త ఎం జానకి, ఉద్యాన శాఖాధికారి ఎన్ సుజాతలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు బైజు, జగన్నాధన్ మాట్లాడుతూ కేరళ నుంచి వచ్చిన శ్రీ రక్ష విత్తనం పెద్దాపురం పరిశోధనకేంద్రం నుంచి రైతులకు పంపిణీ చేయడం జరిగిందన్నారు. 8 నుంచి 9 నెలల కాల వ్యవధిలో కోతకు వచ్చే కర్రపెండలం దుంప దిగుబడిపై రైతుల నుంచి అభిప్రాయాలను సేకరించడం జరుగుతుందని, దిగుబడి సాధారణ విత్తనం కంటే శ్రీరక్ష మరో 10 పుట్లు అధికంగా దిగుబడి రావడం అభినందనీయమన్నారు. అనంతరం రైతుల నుంచి సాగు వివరాలు, దిగుబడి వంటి అంశాలపై వారు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో విహెచ్ఎలు ఎం చిలకమ్మ, విజయదుర్గ, ఎం సత్తిబాబు, జ్యోతి, మల్లిక్, దివ్య, రైతులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర గోదావరి జిల్లా

కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

మూడు కో ఎడ్యుకేషన్ కళాశాలల ఏర్పాటు

విశాలాంధ్ర - అనపర్తి : నియోజకవర్గంలోని మూడు మండలాల్లో కో ఎడ్యుకేషన్ జూనియర్ కాలేజీల ఏర్పాటుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి అన్నారు.బుధవారం ఆయన మాట్లాడుతూ అనపర్తి ఎస్ ఆర్ జడ్పీ హైస్కూల్, బిక్కవోలు జడ్పీహెచ్ఎస్, పెదపూడి మండలం గొల్లల మామిడాడ జెడ్పిహెచ్ఎస్ బాయ్స్ హైస్కూల్లో ప్రారంభించడం జరుగుతుందని విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ లేఖ ద్వారా తెలిపారని ఎమ్మెల్యే సత్తి చెప్పారు. గత విద్యా సంవత్సరంలో మహిళా జూనియర్ కళాశాలలు,ఈ ఏడాది కో ఎడ్యుకేషన్ జూనియర్ కళాశాలలు ఏర్పాటు చాలా సంతోషంగా ఉందని దీంతో ఎంతో మంది పేద విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందని ఎమ్మెల్యే సూర్యనారాయణ రెడ్డి అన్నారు.

సీఎం జగన్ లక్ష్యంగా 7 అసెంబ్లీలు గెలుస్తాం

విశాలాంధ్ర - జగ్గంపేట : సీఎం జగన్ మోహన్ రెడ్డి లక్ష్యంగా కాకినాడ జిల్లాలోని 7 అసెంబ్లీ నియోజవర్గాలను గెలిచేందుకు కృషి చేస్తున్నామని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కాకినాడ పార్లమెంట్ ఇన్చార్జి చలమసెట్టి సునీల్ అన్నారు. ఇన్చార్జిగా నియమితులైన ఆయన మధురపూడి విమానాశ్రయం నుండి 16 నెంబర్ జాతీయ రహదారి మీదుగా జగ్గంపేట నియోజకవర్గానికి చేరుకున్నారు. నియోజకవర్గ కేంద్రమైన జగ్గంపేట శ్రీ చైతన్య స్కూల్ వద్ద కాకినాడ జిల్లా జెసిఎస్ కో ఆర్డినేటర్ ఒమ్మి రఘురామ్, ఉప్పలపాడు సొసైటి చైర్మన్ పాము సూరిబాబు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అత్తులూరి సాయిబాబు, తోట విష్ణు మూర్తి, కరుటూరి రాజు, ఎస్ఏ గఫూర్, తదితర నియోజకవర్గంలోని వైసిపి శ్రేణులు ఆయనకు పూలమాలలు, శాలువాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సునీల్ మాట్లాడుతూ కాకినాడ పార్లమెంటుకు గతంలోతాను పోటీ చేసి ఓడి పోయినా, సీఎం జగన్ తనను పిలిచి పోటీ చేయమని చెప్పారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు, పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారానికి నల్లమిల్లి దంపతుల శ్రీకారం

విశాలాంధ్ర - అనపర్తి : అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో గత సాంప్రదాయాన్ని పాటిస్తూ రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి దంపతులు ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. బుధవారం సెంటిమెంట్ పాటిస్తూ ఎప్పటిలానే అనపర్తిలో మొదటి ఓట్లు తాడి రామారెడ్డి మాస్టర్ దంపతులు, మహేంద్రవాడలో తేతలి అబ్బాస్ రెడ్డిని నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మహాలక్ష్మి దంపతులు అభ్యర్థించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

ఇంటర్ జోనల్ క్రీడా పోటీలు ప్రారంభం

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి భాష్యం స్కూల్లో బుధవారం ఇంటర్ జోనల్ క్రీడా పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలకు నల్లజర్ల, జంగారెడ్డిగూడెం, చింతలపూడి, దేవరపల్లి భాష్యం స్కూల్ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న శాప్ మాజీ డైరెక్టర్ రామన్నపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధాన ఉపాధ్యాయుడు పేరం రవీంద్రనాథ్ మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాల స్థాయి నుండి క్రీడల పోటీలు నిర్వహించటం ఎంతో అభినందనీయమని అన్నారు. పరుగు పందెం, లాంగ్ జంప్, 12 రకాల క్రీడలు పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పీ. పేరయ్య నాయుడు, షేక్ షబానా శ్రీలక్ష్మి, రాధికారిణి వ్యాయామ ఉపాధ్యా యులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్యామలాదేవికి డాక్టరేట్

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి మండలం కృష్ణం పాలెంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మెమోరియల్ ట్రస్ట్ వృద్ధాశ్రమం అధ్యక్షురాలు గుదే శ్యామలాదేవికి డాక్టరేట్ గౌరవ పురస్కారం లభించింది. ఓపు తిలాజికల్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ వారు హైదరాబాదులో ఈ నెల 9వ తేదీన గుదే శ్యామలాదేవికి గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. సామాజిక సేవలో భాగంగా ఆమెకు ఈ డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా బుధవారం వృద్ధాశ్రమంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్యామలాదేవి మాట్లాడుతూ 2015 సంవత్సరంలో తాను వృద్ధాశ్రమం ఏర్పాటు చేశానని, అప్పటినుండి తాను వృద్ధులకు, అనాథలకు వికలాంగులకు తమ ఆశ్రమంలో వసతి కల్పించి అనేక సేవా కార్యక్రమాలు చేసినట్టు తెలిపారు.

మత్తుకు బానిసలు కాకుండా కాపాడుదాం

విశాలాంధ్ర - చాగల్లు : యువత మత్తుకు బానిసలు కాకుండా కాపాడుకుందామని జమాత్ ఇస్లామీ హింద్ చాగల్లు శాఖ కన్వీనర్ తన్వీర్ అన్నారు. బుధవారం ప్రచార కార్యక్రమంలో భాగంగా గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మద్యపానానికి అలవాటు పడి తమ జీవితాలను, భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మాదకద్రవ్యాల దుర్వినియోగం మద్యపానం వల్ల అనేకమంది మృతి చెందుతున్నారని అన్నారు. మత్తు పదార్థాల దుర్వినియోగం వల్ల ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి చైతన్య పరిచేందుకు జమాత్ ఇస్లామీ హింద్ ఈనెల 18వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా వివిధ రూపాల్లో కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అల్తాఫ్ జానీ, అబ్బర్ జానీ, నాగూర్ తదితరులు పాల్గొన్నారు.

KAKINADA MUNICIPAL CORPORATION

'e' Procurement Notification

ROC. No.32637/2023/E2, Dt: 14-02-2024

Tenders invited through ap e-procurement platform for **81** works with an estimated contract value of **Rs. 6,50,46,805/-** from the eligible contractors in the following manner.

Seventy Three Works for an amount of Rs. 4,61,94.694/-

Last date and time for downloading bid documents : **28.02.2024 upto 02-00 PM**
Last date and time for submission of bids : **28.02.2024 upto 02-30 PM**

Eight Work for an amount of Rs. 1,88,52,111/-

Last date and time for downloading bid documents : **04.03.2024 upto 02-00 PM**
Last date and time for submission of bids : **04.03.2024 upto 02-30 PM**

Tender Inviting Authority : **Commissioner, Municipal Corporation, Kakinada.** Mail : Call Centre Phone : 0884-2357722.

Further Details can be seen at 'e' procurement market place @ www.apeprocurement.gov.in

Sd/- Jallepalli Venkata Rao,
Commissioner
Municipal Corporation, Kakinda